చంద్రగ్రహణం

భమిడి వెంకటేశ్వర్లు

చంద్రశేఖర్ ఆలోచనలో పడ్డాడు. అతని మనసు చాలా చికాగ్గా, ఆందోళనగా వుంది. మరోవైపునుంచి కోపం! ఏం చేసేందుకు తోచటం లేదు. ప్రస్తుతం అతన్ని వేధిస్తున్న సమస్య ఒక్కటే! తనకు అర్జంటుగా అయిదువేల రూపాయలు కావాలి. ఎప్పుడో మూడేళ్ళ క్రితం, తనతో స్నేహితుడు పెళ్ళానికి తెలియకుండా దాచమని ఆ డబ్బు యిచ్చాడు. అప్పటికీ చంద్రశేఖర్ చెప్పాడు 'నా గురించి నీకు తెలుసు. నా దగ్గర డబ్బు వుండదు. పొరపాటున వున్నా ఎన్నోవిధాల ఖర్చయిపోతుంది. బహుశా నా అంత దురదృష్టవంతుడు మరొకడు వుండడేమో ...అందులో మా ఆవిడ సంగతి నీకు తెలియనిది కాదు. డబ్బు కనబడితే చాలు, అది ఎవరిదైనా సరే-కోరికల హరివిల్లుకు ఆహ్వానం పలుకుతుంది. ఏ బేంకులోనైనా దాచుకో'' అని... సదరు స్నేహితుడు యిలా జవాబు చెప్పాడు.

"నీ గురించి నాకు తెలుసు. నీ ఖర్చుల గురించి తెలుసు. నిజానికి నువ్వు చెప్పిన సలహా నాకు ముందే గుర్తుకొచ్చింది. మా ఆవిడ గురించి నీకే కాదు నాకే తెలియదు. మీ ఆవిడే బెటరు. బ్యాంకులో డబ్బు దాచి, ఆ పాసు పుస్తకం కడుపులో దాచుకున్నా సరే కడుపు కోసైనా-బయటకు తీసి చూస్తుంది. అప్పుడు నా అవస్థ నీకు ఎలా చెప్పను గురూ...ఇంతవరకూ యీ డబ్బు గురించి యింట్లో చెప్పలేదు. ఏదో అదృష్టం వల్ల, ఆఫీసులో రాదనుకున్న డబ్బు చేతికందింది. నీకు తెలుసుగా, నాకు యింటి నిర్మాణానికి అప్పు మంజూరయిందని! ప్రస్తుతం కట్టదలుచుకోలేదు. అందుకే నీ దగ్గర దాచమంటున్నాను'' అని.

ఆ డబ్బు చూడగానే చంద్రశేఖర్‌కి వంటిమీద జెర్రులు పాకినట్టనిపించింది. గొంతులో వెలక్కాయ పడినట్లయింది. తన యింటిపని నిర్మాణం ఆగిపోయింది డబ్బు లేకపోవటంతో. నాలుగైదు నెలలుగా ఆఫీసులో జీతంనుంచి వంద రూపాయలు మినహాయింపు అవుతోంది. చంద్రశేఖర్ ఆఫీసునుంచి గృహనిర్మాణానికి అప్పు తీసుకున్నాడు. కొన్ని పనులు నిలిచిపోయాయి. ఫలితంగా "ఇంటి నిర్మాణం పూర్తయింది" అనే సర్టిఫికేటు యివ్వలేకపోయాడు. ఫలితంగా యీ బాధలు... యిబ్బందులు....జీతంలో కోత...

అటువంటి సమయంలో స్నేహితుడు డబ్బు దాచుకుంటానికి దేవుడు పంపినట్లుగా వచ్చాడు. ఆనందం, సంతోషం కలిగినా మరోవైపు నిస్సహాయత.... బెంగ...ఆందోళన...

"నువ్వడిగినప్పుడు నేను యివ్వలేనేమో...నా పరిస్థితులు నీకు తెలుసుగా" అక్కడికీ చెప్పి చూసాడు చంద్రశేఖర్.

"ఆ మాత్రం నాకు తెలియదా...నాలుగు నెలలు ముందుగా చెప్తాను. నీ వయసుకు, అనుభవానికి, పరపతికి, అయిదువేలు సంపాదించటానికి నాలుగు నెలలు అవసరం లేదు. కాబట్టి నిశ్చింతగా వుండు."

స్నేహితుడు యిరకాటంలో పెట్టేసాడు అతన్ని.

"ఎందుకైనా మంచిది, యీ డబ్బు గురించి మీ ఆవిడకు చెప్పు. ఇంటి నిర్మాణం కోసం వుపయోగించాలంటే, ఆమె మాత్రం దుబారాగా ఖర్చు చేస్తుందా ..." అన్నాడు చంద్రశేఖర్.

"వద్దు గురూ....నువ్వే కెటుకు....స్విస్‌బ్యాంకు బాంకుకంటే రహస్యంగా, జాగ్రత్తగా వుంటుంది నీ దగ్గర. ఆ నమ్మకం నాకుంది."

ఆపైన మాట్లాడలేకపోయాడు చంద్రశేఖర్.

స్నేహితుడి దగ్గర డబ్బు తీసుకున్నాడు.

"ఏమండీ....జీతంలో వంద రూపాయలు తగ్గిపోతే సంసారం ఎలా గడుస్తుంది. ఎన్నో అప్పులు చేస్తూ, ఖర్చులు తగ్గించుకుంటూ, సరదాలు వాయిదా వేసుకుంటూ ఎలా కాలక్షేపం చేస్తున్నామో మీకు తెలుసు. ఇప్పుడు యీ డబ్బుతో మిగిలిపోయిన పనులు పూర్తి చేసేసి, ఆ దిక్కుమాలిన సర్టిఫికేటు ఆఫీసులో యిచ్చేస్తే జీతం మామూలుగా వస్తుంది. ఇంటిపనులు పూర్తయినట్టుగా వుంటుంది. ఎప్పటికైనా యివి చేయించాలిగా! అంటూ సలహా యిచ్చింది జానకి.

చంద్రశేఖర్ అనుకున్నట్టుగానే జరిగింది.

వెంటనే యింటిపనులు చేయించేసాడు. నెలలో అన్ని పనులు పూర్తయిపోయాయి. ఆఫీసులో సర్టిఫికేటు యిచ్చేసాడు. ఇప్పుడతనికి హాయిగా, తృప్తిగా వుంది. ఇంటి పనులు పూర్తయ్యేసరికి యింటికి ఓ విధమైన నిండుతనం, కొత్తదనం కనిపించసాగాయి. మరోవైపు బాకీ విషయం గుర్తుకు రాగానే... విచారం బెంగ ...

తెలియకుండానే ధైర్యం కలగసాగింది అతనికి. అయిదువేలు సంపాదించలేకపోతామా అనే ధీమా అతనిలో టానిక్‌లా పని చేయసాగింది. అప్పుడప్పుడు బెంగ మాత్రం వేధిస్తూనే వుంది.

కాలం గిర్రున తిరిగిపోసాగింది.

అప్పు యిచ్చిన స్నేహితుడు వచ్చాడు ఆరునెలల క్రితం....అప్పట్నుంచీ ప్రయత్నం చేయసాగాడు చంద్రశేఖర్. అనుకున్నంత తేలిగ్గా డబ్బు దొరికితే, సంపాదించగలిగితే—మనుషుల జీవితాలు యిలా వుండవేమో!

ఏ మాట కామాటే చెప్పాలి. చంద్రశేఖర్‌కి డబ్బంటే చాలా భయం. చేతిలో డబ్బు లేకపోతేనే హాయిగా వుంటుందతనికి. అప్పులు చేయటం, అరువు తీసుకోటం సుతరాం యిష్టం వుండదు, మరీ కొంపలు మునిగితే తప్ప. అటువంటి పరిస్థితులు పదేళ్ళ క్రితం వచ్చి పడ్డాయి. అంతే సదరు గురుడు అప్పు చేయక తప్పలేదు.

పదిహేనేళ్ళ క్రితం, హైదరాబాదులో ఉద్యోగం నిమిత్తం వచ్చినప్పుడు... నాలుగు నెలలకు గృహస్థాశ్రమం స్వీకరించినప్పుడు అసలు సమస్య ఆరంభమయింది, ఇంటి యజమానులు యిల్లు అద్దెకివ్వటం వ్యాపార ధోరణిలో జరగటం చంద్రశేఖర్‌ని మరీ ఇరకాటంలో పడేసింది. రకరకాల కారణాలతో యిల్లు ఖాళీ చేయించటంతో అతను అయిదేళ్ళల్లో ఆరు యిళ్ళు మారవలసి వచ్చింది.

ఆ సమయంలో ఆఫీసులో ఎవరి ద్వారానో ఇళ్ళస్థలాలు అమ్మకం గురించి తెలిసింది. డబ్బు లేనివాడు ముందే నావ ఎక్కినట్లుగా, చేతిలో పైసా లేకుండానే యిళ్ళ స్థలాల గురించి వేట ఆరంభించాడు.

జానకితో వెళ్ళి ప్లాటు చూసి వచ్చాడు. ఇద్దరికీ నచ్చింది. మరో యిద్దరి స్నేహితులని కూడా తీసుకెళ్ళి చూపించాడు. వాళ్ళు కూడా గ్రీన్‌సిగ్నల్ యిచ్చారు. అంతే, అమ్మకందారుతో ఆమోదం తెలిపాడు చంద్రశేఖర్.



"కేవలం ఆమోదం తెలిపితే చాలదు. ముందు రెండువేలు కట్టాలి. మూడు నెలల తరువాత అయిదువేలు కట్టాలి. ఆరో నెలలో మిగిలిన డబ్బు అంటే మూడు వేలు కట్టాలి." చెప్పాడు అమ్మకందారు.

అతను యిరకాటంలో పడ్డాడు.

ఎవరిని అడిగినా వందల్లోనే సర్దగలమన్నారు. అలా ప్రయత్నించినా వెయ్యి రూపాయలు మించలేదు. అప్పుడు చూడాలి చంద్రశేఖర్ పరిస్థితి! అంతే అప్పు చేసి రెండు వేలు యిచ్చి తృప్తిగా నిట్టూర్చాడు. ఆ అప్పుల వలలోనుంచి ఎలా బయటపడాలి? ఆ తరువాత రెండువేలు...ఆ పైన నాలుగువేలు...యీ విధంగా ఎనిమిది నెలల కాలంలో అప్పు సంపాదించి యింటి స్థలం కొనేసాడు. చంద్రశేఖర్‌కి గర్వం తొంగిచూసింది...మరోవైపు విచారం, బెంగ....తెలియకుండానే ఏదో ధీమా!

వెంటనే గృహ నిర్మాణానికి ఆఫీసులో అప్పుకోసం అప్లయ్ చేసాడు. సహకారసంఘ సొసైటీ నుంచి కూడా అప్పు లభించింది. మొత్తం ఆరునెలల కాలంలో అతని చేతిలో నలభై వేలు డబ్బు వచ్చి పడింది. అట్టహాసాలకు, ఆర్భాటాలకు పోకుండా, జాగ్రత్తగా యిల్లు కట్టాడు ఆరు గదులతో.

వెంటనే మూడు గదులు అద్దెకిచ్చేసాడు.

ఇంటి అద్దెతో చేసిన అప్పులు నెమ్మది నెమ్మదిగా తీర్చటం...మిగిలిన యింటిపనులు పూర్తి చేసేందుకు కొత్తగా అప్పులు చేయటం....అలవాటయింది చంద్రశేఖర్‌కి. సిమెంటు ఫ్రీగా దొరక్కపోవటం, బ్లాకులో కొనటం, గృహ నిర్మాణ వస్తువుల ధరలు పెరగటంతో, పనులు చురుకుగా జరిగేవి కావు.

వాయిదాల మీద పనులు చేయించటం తప్ప మరోమార్గం చంద్రశేఖర్‌కి కనిపించలేదు.

అతనికి అప్పుడప్పుడు కోపం, చిరాకు కలుగుతూ వుంటుంది. మనిషికి డబ్బు లేకపోయినా, దొరక్కపోయినా కోపం తప్పనిసరిగా కలుగుతుందేమో! ఇప్పుడు స్నేహితుడి బాకీ ఎలా తీర్చాలి అన్నదే అతని ప్రస్తుత సమస్య!

ఆలోచిస్తున్నాడు...పరిష్కారం దొరకలేదు.

నాలుగు రోజుల క్రితం స్నేహితుడొచ్చి డబ్బు గురించి మళ్ళీ గుర్తు చేసాడు. సరే అనేసాడు చంద్రశేఖర్....కాని ఎలా సంపాదించాలి...ఎవరి నడగాలి .. ఈ గండం ఎలా గట్టెక్కాలి?

చంద్రశేఖర్‌కో అలవాటుంది. ఏదైనా సమస్య, యిబ్బంది ఎదురైనప్పుడు ఏ రైల్వే స్టేషనుకో, బస్టాండుకో వెళ్ళి ఆలోచించటం అంటే అక్కడుండే జనం తన సమస్యలని పరిష్కరిస్తారని కాదు, ఆదుకుంటారని కాదు. కాసేపైనా తనను తాను మరిచిపోయి, నిర్భయంగా నిశ్చింతగా వుండగలిగే ఏకైక ప్రాంతం అది.

అందుకే సికింద్రాబాదు రైల్వేస్టేషనుకు బయలుదేరాడు చంద్రశేఖర్. రద్దీ, సందడిని చూస్తుంటే అతనికి కొంత ఉపశమనంగా వుంటుంది. ఫ్రీగా వుంటుంది. అప్పుల్లో పడినప్పట్నుంచీ, సమస్యల్లో చిక్కుపడినప్పట్నుంచీ... పదిహేను, యిరవై రోజులకొసారైనా అతను ప్లాట్‌ఫారం మీదకు వెడుతుంటాడు.

చంద్రశేఖర్‌లో యింకా పదిహేనేళ్ళ క్రితం మిగిలిపోయిన "పురిటి వాసన" పోలేదు. బహుశా ఎప్పటికీ పోదేమో! ఆ "పురిటి వాసన" అందించిన, మిగిల్చిన "కళ్యాణి"ని కూడా మరువలేదు.

చంద్రశేఖర్ రోడ్డుమీద నెమ్మదిగా నడుస్తున్నాడు.

ఇప్పటికీ తాను అనుకుంటూ వుంటాడు, తను కొన్ని పొరపాట్లు చేశానని, అప్పట్లో ఆలోచించే అవకాశం, వయసు లేదు. తొందరపాటు 'చర్య'గా భావిస్తుంటాడు...ఇప్పటికీ అదే సరియైన నిర్ణయంగా భావించలేదు. చూస్తుండగానే పదిహేనేళ్ళు పదిహేను నిముషాలుగా దొర్లిపోయాయి. చేసిన పొరపాట్లు మరోసారి గుర్తుకొచ్చాయి. అంతలోనే ఏదో సర్దుబాటు....అంతకన్నా ఎక్కువగా వేదాంతం గుర్తుకు వచ్చింది.

ఎం.ఎస్సి. పాసైన నేరానికి దిగువ తరగతి గుమాస్తాగా ఉద్యోగం... అదికూడా కళ్యాణి ప్రోత్సాహం, ప్రోద్బలంతో.

చంద్రశేఖర్‌లో విజయవాడ వాతావరణం, పరిస్థితులు పూర్తిగా నాటుకుపోయాయి. ఆ ఉద్యోగంలో అప్పట్లో మరో యిరవై ఏళ్ళకుగాని సీనియర్ గుమాస్తాగా ప్రమోషను రాదని-వేరే మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించమని సలహా యివ్వటం...ఫలితంగా ఉద్యోగాల వేట...

కళ్యాణిని పెళ్ళాడేందుకు అతని తండ్రికి, తల్లికి ఏమీ అభ్యంతరం లేదు. ఆమె తల్లికి వున్నా, అంతగా లెక్కపెట్టదు కళ్యాణి...కాని ఎదిరించలేని బలహీనత మాత్రం ఆమెలో లేకపోలేదు.

"పెళ్ళంటే మాటలు కాదు. ఎన్నో విషయాలు ఆలోచించాలి. అందులో ఉద్యోగం చేసే ఆడదాని విషయం జాగ్రత్తగా పరిశీలించాలి. బాగా స్టడీ చేయాలి. ఆడవాళ్ళని అర్థం చేసుకోటం కష్టం. వారి ఉద్దేశం ఎప్పుడు ఎలా మారుతుందో.... చెప్పలేము. అందుకే వారిని చపలచిత్తు లంటారు. "దాదాపు పది పదిహేనుసార్లు అయినా చెప్పి వుంటాడు చంద్రశేఖర్ తాత, కొడుకుతో.

అప్పుడు అతని తండ్రి వేరే సంబంధం చూసాడు. జానకితో వివాహం గమ్మత్తుగా, కాకతాళీయంగా జరిగిపోయింది.

జానకి స్కూల్ ఫైనల్ దాకా చదివింది, టైపులో లోయరు పరీక్ష వ్రాసయింది! అందుకే చంద్రశేఖర్ అప్పుడే, భార్యచేత అప్పుడే వచ్చిన రైల్వేసర్వీసు కమీషను ప్రకటన చూసి అప్లయ్ చేయించాడు! కాని దురదృష్టం...యోగం.... ప్రాప్తం...వీటిమీద మనుషులకు నమ్మకం లేకపోయినా, ఆలస్యంగానైనా వాటిమీదే నమ్మకం ఏర్పడి జీవితాలని మారుస్తుంటాయేమో!

ఉద్యోగాలు తేలిగ్గా వచ్చిపడితే, దేశానికి నిరుద్యోగ సమస్య ఎందుకుంటుంది? నాయకులకు పనెక్కడుంటుంది! అల్లర్లు, సందేశాలు, గొడవలు ఏం కావాలి?

ఇప్పటికీ చంద్రశేఖర్ అనుకుంటూనే వుంటాడు-జానకి ఎలా ఎస్సెల్సీ పాసైందని! అందులో డెబ్బై శాతంతోనా! విద్యాప్రమాణాల మీద అతనికి కోపం కలిగింది. చదివినవాళ్ళు పరీక్ష తప్పటం...పుస్తకం చూడనివాళ్ళు, బ్రహ్మాండమైన మార్కులతో ప్యాసవటం....ఆశ్చర్యం వేస్తూ వుంటుంది....

వ్రాతపరీక్షకు జానకికి పిలుపు వచ్చింది. ఆర్డరు కాగితం అందుకోగానే ఆమె చేతులు వణికాయి. పరీక్ష భయం ఆవరించింది. చంద్రశేఖర్ ఏవో గైడ్లు కొన్నాడు. భార్యచేత చదివించాడు. కాని బుర్రకెక్కితే కదా....ఎంత చెప్పినా అర్థమయ్యేది కాదు. చెప్పింది గుర్తుంటే చస్తేగా! పంచరు పడ్డ ట్యూబులో ఎంత గాలికొట్టినా ఏం లాభం?

జానకి పరీక్షకు హాజరు కాలేదు.

ఏ మాటకామాటే చెప్పాలి. ఆమెకు ఉద్యోగం చేయాలనుంటుంది. కాని తేలిగ్గా ఎవరు పిలిచి ఉద్యోగం యిస్తారు! అందులో యీ రోజుల్లోనా? భుజానికి వానిటీ బ్యాగు ధరించి, కొత్త కొత్త చీరలు కట్టి—అందరిలాగే ఆఫీసులకెళ్ళి నిద్రపోవాలని జానకి ఆరాటం....పనిచేయకుండా [illegible] కబుర్లు చెప్పి నెలయ్యేసరికి రెవెన్యూస్టాంపు మీద సంతకంచేసి, నోట్లు లెక్కపెట్టుకుని బ్యాగులో పెట్టుకోవాలని కోరిక.

కానీ ఏదీ జరగలేదు....వయసు పెరగటం....ముగ్గురాడపిల్లలు పుట్టటం.... కొడుకు కోసం నాలుగోసారి గర్భం దాల్చటం అప్పుడు కూడా ఆడపిల్లే పుట్టటం... చంద్రశేఖర్‌కి భయం కలిగింది. నగర జీవితం....పెరిగే ధరలు ... పెరగని

జీతం.... పై సంపాదన లేని ఉద్యోగం.... మరోవిధంగా సంపాదించటం యిష్టంలేని మనస్తత్వం.... అతన్ని ఎగతాళి చేయసాగింది.

జీవితం మీద విరక్తి.... ఏర్పడింది. దానికితోడు జానక్కి భర్త మీద చులకనభావం కలగటం.... నలుగురూ ఆడపిల్లలే పుట్టటం.... రోజూ దంపతుల మధ్య ఏదో విషయంలో పోట్లాట, ఘర్షణ... మనశ్శాంతి లోపించటం.... భార్య చేసే అనవసరపు దుబారా ఖర్చులు చంద్రశేఖర్‌ని అప్పుల్లో పడేసింది.

"హరి భగవంతుడా ... ఈ అప్పులెలా తీరుస్తావ్... ఏదైనా దారి చూపిస్తావా ... పాత అప్పులు తీర్చేందుకు కొత్త అప్పులు చేయటం తప్ప మరో మార్గం లేదా.... అందరి జీవితాలు యిల్లాగే వున్నాయా? నాకేనా యీ శాపం?" అనుకోని రోజు వుండదు.

దానికితోడు జానకితో మరో సమస్య. ఆమెకు దైవభక్తి ఎక్కువ. ప్రతీదీ దేవుడికే వదిలిపెట్టి, మన ప్రయత్నం ఏమీ అవసరం లేదు అన్న నమ్మకాన్ని పెంచుకోటం చంద్రశేఖర్‌కిష్టం వుండదు. "దేవునికి నువ్వు ఒక్కత్తే భక్తురాలు కాదు. కోట్లమంది వుంటారు. ఎందరికి ఆ దేవుడు కోరికలు తీర్చి గట్టెక్కిస్తాడు. నిజంగా తీర్చేస్తే ఎవరు తనని కొలుస్తారు ... అందుకే చాలా కోరికలని తీర్చకుండానే, కళ్ళు మూసుకుంటాడు. ఓ చెవితో విన్నదాన్ని, మరో చెవిలోనుంచి వదిలేస్తాడు." అంటూ వుంటాడు అతను.

ఆలోచనలతో స్టేషను చేరాడు చంద్రశేఖర్.

* * *

ప్లాట్‌ఫారం టిక్కెట్టు కొని లోపలికెళ్ళి కాంటీనులోకి అడుగు పెట్టాడు. కౌంటర్లో టోకెను తీసుకుని, కాఫీ సెక్షన్లో యిచ్చాడు. కాఫీ కప్పు అందుకుని ఖాళీగా వున్న ఓ కుర్చీలో కూర్చున్నాడు. నెమ్మదిగా కాఫీ సిప్ చేయసాగాడు చంద్రశేఖర్.

కళ్ళ ముందర స్నేహితుడి రూపం కనిపించింది.

అతనిచ్చిన అయిదువేలు.... ఆ బాకీ తీర్చేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలు గుర్తుకొచ్చాయి మళ్ళీ.

కాఫీ తాగటం పూర్తయింది. బయటకు నడిచి ప్లాట్‌ఫారంమీద నిలబడ్డాడు. అన్ని లైన్లమీదా ఏవో పాసెంజరు రైళ్ళు, గూడ్సు రైళ్లు... అక్కడక్కడ ఖాళీ లైన్లమీద షంటింగు చేస్తున్న యింజన్లు ... రైల్వే సిబ్బంది పరుగులు, కేకలు వినిపిస్తున్నాయి.

చంద్రశేఖర్ మరికొంచెం ముందుకు నడిచాడు.

ప్రయాణీకుల ఉరుకుల పరుగులు, వారిని సాగనంపేవాళ్లు, అమ్ముకునే వాళ్ళు, బిచ్చగాళ్ళు, దేశజనాభా ప్లాట్‌ఫారం మీదే వచ్చి పడినట్టుగా వుంది. చికాగ్గా వున్నా, మనసులో వున్న ఆలోచన చంద్రశేఖర్‌ని అంతగా విసిగించటం లేదు.

అతనికి జానకి మీద కోపంగా వుంది. ఇల్లు బాగుపడాలనే అందరు కోర్కుంటారు. కాని ఆమె భేషజాలకే విలువ యిస్తుంది. ఈ మనుషులు, యీ సమాజం వీటికే ప్రాముఖ్యత నిస్తారు. నలుగురిలో గొప్పగా కనిపించేందుకే తాపత్రయ పడతారేమో! నీటిబుడగలాటి జీవితం కోసం... పాలపొంగులాంటి ఆశల జీవితం కోసం ఆరాటము?

ఎప్పుడో ఆర్థికపరిస్థితి కొంచెం మెరుగ్గా వున్న రోజుల్లో ఓ కుట్టుమిషను కొన్నాడు చంద్రశేఖర్.

"ఎందుకండీ అనవసరంగా కుట్టుమిషను" అంటూ విసుక్కుంది జానకి.

"ఎందుకేమిటి... కష్టపడి నలుగురు ఆడపిల్లల్ని కన్నావుగా...., మీ గుడ్డలు టైలరుకిస్తే ఎంతవుతుందో తెలుసా? కుట్టుపని నేర్చుకుంటే మంచిది. ఇతరులవి కూడా కుడితే సంపాదన వుంటుంది." చెప్పాడు చంద్రశేఖర్-కుట్టుపనిమీద వుండే ఆదాయం మరి దేనిమీదా లేదనే విషయాన్ని నొక్కి చెప్తూ.

జానక్కి యీ సలహా బాగానే వుందనిపించగానే, యింటికి దగ్గర్లో వున్న కుట్టుపని నేర్పే స్కూల్లో చేరింది. ఆరునెలల కాలంలో నేర్చుకున్నది ఏమీ లేకపోయినా డబ్బు మాత్రం బాగానే ఖర్చయింది. స్నేహితులు, చుట్టుపక్కల వాళ్ల కొత్త గుడ్డలు కుట్టించుకోకపోయినా, చిరిగిన జాకెట్లు, చీరలు, లంగాలు "రఫ్" చేయించుకోటం చంద్రశేఖర్ క్కూడా యిష్టం వుండేది కాదు. ఇటువంటి "ప్రజా సేవ" కోసమా తాను కుట్టుమిషను కొన్నది! అయినా యిచ్చేవాళ్ళకైనా బుద్ధి వుండదేమో? వాళ్ళకెందు కుంటుంది! ఫ్రీగా అందరూ పాలు పోస్తుంటే, వేరే ఆవుని ఎందుకు కొనటం అన్నట్లుగా వుంది.

"నువ్వోసారి ఏదో కారణం చెప్పి చూడు. అప్పుడు ఎవరూ యిలా చేయరు" ఎన్నోసార్లు సలహా యిచ్చాడు చంద్రశేఖర్.

ఎప్పటికప్పుడు భర్త సలహా పాటించాలనే అనుకొనేది జానకి. కాని, తీరా ఆచరణలో కొచ్చేసరికి "మొహమాటం" నోటిని కట్టిపడేసేసరికి కథ మళ్ళీ మొదటికే వచ్చిపడేది.

ఆ మధ్య ఆఫీసులో అనుకోకుండా "బకాయిల పని" చేసినందుకు పదిహేను వందల రూపాయలొచ్చాయి.

"హమ్మయ్య... మరో ముప్పయ్ అయిదొందలు సంపాదిస్తే వాళ్ళ అప్పు తీర్చేయచ్చు" అన్నాడు చంద్రశేఖర్ భార్యతో.

జానక్కి అది నచ్చలేదు.

"ఈ డబ్బు రాలేదనుకొని మొత్తం డబ్బు కోసం ప్రయత్నించండి. దీనితో కేసెట్ టేపు రికార్డరు కొనుక్కుందాం... అందరిళ్ళల్లోనూ వుంది. పిల్లలు సరదా పడుతున్నారు.... ఎవరిళ్ళకో వెళ్ళి వింటున్నారు అంది జానకి.

"టేపురికార్డరు అంటే మాటలు కాదు. తరచు కేసెట్లు కొంటూ వుండాలి. కొనకుండా వుండలేము. ఇంక రిపేర్లు వస్తే చెప్పాలా... కాబట్టి యీ డబ్బుతో బాకీ తీరుద్దాం" నిశ్చయంగా చెప్పాడు.

జానకి వినిపించుకోలేదు.

చంద్రశేఖర్ సాయంత్రం ఇంటికొచ్చేసరికి ఇంట్లో టు-యిన్-వన్ వుంది. నిస్సహాయత అతన్ని వెక్కిరించింది. తన మాట గెలవలేదు. ఓడిపోయిన బతుకు ఎందుకని అనిపించింది.

"రెండు కేసట్లు, నాలుగు బాటరీలు ఫ్రీగా ఇచ్చాడు" అంటూ చూపించింది జానకి.



"నీలాటి వాళ్లుండబట్టే వ్యాపారస్తులు కోట్లు సంపాదిస్తున్నారు. ఏలాగైనా సరుకు అమ్ముడుపోవాలన్న ఉద్దేశంతో ఏదో ఒకటి 'ఉచితం' అంటారు. లేదా 'తగ్గింపు' అంటారు. మనం రోడ్డుమీద పారేసే చెత్తని కూడా వాళ్లు జాగ్రత్త పరచి—ఏదో పేరుపెట్టి, ఏవో రంగులు పూసి తిరిగి మనకే అమ్ముతారు. మనుషుల్లో యిటువంటి బలహీనత వున్నంతకాలం ఏ వస్తువైనా అమ్ముడయి పోతుంది"

జానకి భర్త నోటికి తాళం వేసింది.

"వాయిదాల్లో యిస్తున్నారని ఆ టీ.వీ. కొనిపించావు. పదిహేనువందలు అప్పు చేయించి ముందిచ్చి, వస్తువు యింటికి తెచ్చావు. నెలకు వంద రూపాయలు వాయిదా కట్టాలంటే ఎంత అవస్థగా వుందో చూస్తున్నావు కదా....దానికితోడు 'షోకు తగ్గిపోయినట్టుగా స్టాండు, షట్టర్లు కొనిపించావు. ఎందుకు? యిదంతా టేబులు మీదపెట్టి, ఓ తువ్వాలు కప్పితే చాలదూ! చెప్తే వినవు..." అంటూ విసుక్కున్నాడు అతను.

తెక్కచేసేవారికి ఎంత చెప్పినా ఫరవాలేదు.

ఆ మధ్య కాలనీలో ఓ యిల్లాలు పట్టుచీర కొనుక్కుని జానకికి చూపించింది. ఆమె భర్తకు చూపించింది, తనకూ ఒకటి కొనమంటూ.

"పట్టుచీర చాలా రేటుంటుంది. పైగా రోజూ కట్టుకొనేందుకు వీలుండదు. ఏమైనా నూనె మరకలు పడితే యింతే సంగతులు. ఆ ఖరీదుతో మామూలుగా కట్టుకునే చీరలు కొనుక్కుంటే మంచిది" అంటూ సలహా యిచ్చాడు చంద్రశేఖర్.

"ఏదో సామెత చెప్పినట్టుగా వుంది మీ ధోరణి...అయినా మిమ్మల్ని అంటకట్టి మా నాన్న చాలా పొరపాటు చేశాడు. సరదాలు, కోరికల మాట దేవుడెరుగు....కనీసం మగపిల్లాడిని కనే యోగం కూడా దేవుడు యివ్వలేదు" అంటూ ఓసారి కళ్ళనీళ్ళు పెట్టుకుంది జానకి.

చంద్రశేఖర్ వుండే కాలనీ షోష్ కాలనీ. అలా అని అక్కడ నివసించే వాళ్ళందరూ హైక్లాసు మెంటాలిటీతో వున్నారంటే పొరపాటే. ఘరానా పెద్ద మనుషులు. చీకటి పనులు చేసే పెద్ద మనుషులు. వాళ్ళంతా పెళ్ళాల మాట వింటారు. కారణం లేకపోలేదు. అంతో యింతో పుట్టింటినుంచి ఆస్తో, కట్నాలో తెచ్చి మొగుళ్ళకిచ్చారు. ఆ అభిమానంతోటి సర్దుకుపోతుంటారు. పెత్తనం ఆడవాళ్ళదే: కావలసినది కొనకపోతే నిద్రపట్టదు. అది ఎదుటివాళ్ళకు చూపించి, మెప్పు పొందకపోతే తిన్నది అరగదు. వాళ్ళని తేలిగ్గా చూడకపోతే సంసారం చేస్తున్నట్టుండదు.

"పోనీ నాకు రేపు దసరా పండగలకైనా పట్టుచీర కొనండి" భర్త మూడ్ కనిపెట్టి అడిగింది జానకి.

చంద్రశేఖర్ గట్టిగా నవ్వాడు.

"చూడు జానకీ....నువ్వు కొనమంటేనే గ్రైండరు, వాషింగు మెషీను, ఎలక్ట్రానిక్ గోడ గడియారం, సోఫా కం బెడ్ కొన్నానా? ఇప్పుడు మన ఆర్థిక పరిస్థితి ఎలా వుందో నీకు తెలుసు. పైగా మనం ముందుగా తీర్చవలసిన అయిదు వేల బాకీ ఒకటుంది. ఇంటిపన్ను కూడా మూడేళ్ళనుంచి కట్టాలి. ఇంటికి రంగులు వేయించకపోయినా కనీసం సున్నం అయినా వేయించాలి. చిల్లర బాకీలు దాదాపు నాలుగువేలున్నాయి. అంటే మొత్తం తొమ్మిదివేలు అప్పు పెట్టుకొని నువ్విలా కోరటం న్యాయమేనా ఆలోచించు" చంద్రశేఖర్ సర్ది చెప్పబోయాడు.

"మరి కొనేవాళ్ళంతా ఎలా కొంటున్నారని....వాళ్లు కూడా మీలాగే యుడీసీలే కదా....అందరికీ జీతాలు సమానంగానే వస్తాయి కదా....మనకే ఎందుకిన్ని ఇబ్బందులు?

అతనికేం చెప్పాలో తెలియలేదు.

"ఆ విషయం నీకు తెలుసు. అప్పు చేసి బతకటం, లేని గొప్పలు కోసం ప్రాకులాడటం నాకిష్టం లేదు. అప్పు చేయటం తేలిక కాని యింటిముందుకొచ్చి గోలపెడితే ఎంత నామోషీ! అది నాకిష్టం లేదు. చేసిన అప్పులు చాలు. అవి తీర్చగలిగితే ఈ జన్మ ధన్యమైనట్టే" చంద్రశేఖర్ అన్నాడు.

"పోదురూ....ఎందుకొచ్చిన వేదాంతం యిది, కడుపు నిండేదా? కొనటం యిష్టం లేకపోతే సరి...." జానకి కొట్టి పారేసింది.

చంద్రశేఖర్ సరదాకు టైపు హయ్యరు నేర్చుకున్నాడు. సర్టిఫికేటు కూడా పొందాడు. "పోనీ ఎక్కడైనా పార్ట్‌టైముగా టైపు పని చేయచ్చు కదా....నేర్చుకున్నదాన్ని సద్వినియోగ పరచుకోవచ్చు కదా...." చాలాసార్లు అనేది జానకి.

"ఇరవై నాలుగ్గంటలూ సంపాదన తప్ప మరో ఆలోచన వుండదు? ఆరోగ్యం ఏం కావాలి? నాకొచ్చే జీతం మన సంసారానికి చాలు, లేనిపోని గొప్పలు అరికడితే సరి! నిజాయితీగా ఉద్యోగం చేసి, వచ్చే జీతం చాలు....కాని చాలామందికి చెడుదారులు తొక్కటం అలవాటయి పోతోంది....అది నాకిష్టం వుండదు"

భర్త ధోరణి జానకికి అంతుపట్టదు. సంపాదించే తెలివితేటలు లేని ప్రతి మనిషి ఇలాగే మాట్లాడతాడని ఆమె ఉద్దేశం!

ఇది "షో" ప్రపంచం! ఇంట్లో ఎలా వున్నా పైకి మాత్రం హుందాగా, డాంబికంగా కనబడే ప్రయత్నం చేసేవాళ్లు ఎక్కువవుతున్నారు. ఖరీదైన బట్టలు ధరించటం....వారానికో సినిమా చూడటం....టీ.వీ. పాతదై పోయింది కాబట్టి వీడియో వున్నవారినే గుర్తించే నవశకం ఆరంభమవటం....చేసే ఉద్యోగంతో సంబంధం లేకుండా గొప్పలకు ఎగబడేవారినే సమాజం గౌరవిస్తోందేమో!

మొన్నటికి మొన్న జరిగి అప్పుడే నాలుగు నెలలు అయింది! అప్పుదేమయిందని—

చంద్రశేఖర్ ఎంత చెప్పినా వినకుండా జానకి పిల్లల్ని తీసుకుని పుట్టింటి కెళ్ళిపోయింది! వేసవికాలం సెలవులు స్కూళ్ళకు యివ్వగానే. అయిష్టంగానే అతను వారినే బస్సు ఎక్కించి వచ్చాడు. ఇదో ఆరేడువందల ఖర్చు....అతని దృష్టిలో రూపాయికి కూడా నూరుపైసల విలువ వుంది.

"ఇప్పుడెందుకు జానకీ....ఎవర బోలెడంత ఖర్చు కనబడుతుంది! ఇవ్వవలసిన బాకీ ఎలా తీర్చాలో తెలియక నేను సతమతమవుతుంటే యీ ప్రయాణం దేనికి?" అని చెప్పి చూసాడు నాలుగైదుసార్లు!

భర్త మాటని జానకి వినిపించుకోలేదు! "ఏం మనిషో....ఎప్పుడూ డబ్బు, ఖర్చులు, అప్పుల గురించే ఆలోచన....పుట్టింటికెళ్ళని ఆడది ఉంటుందా" స్వగతంలో ఆమె అనుకున్నా చంద్రశేఖర్‌కి వినిపించాయి ఆ మాటలు!

కాని ఏం చేయగలడు?

రూపాయి సంపాదించటం కష్టం! ఖర్చు చేసేందుకు ఎంతోసేపు పట్టదు!

ఆలోచించే అవసరం వుండదు! ఊరగాయలు పెట్టేందుకు అరొందలు అయింది! క్రితం ఏడు ఇద్దరు పిల్లల్ని వేరే స్కూళ్ళల్లో చేర్పించేందుకు పదిహేను వందలు డొనేషను కట్టాడు చంద్రశేఖర్! ఈ యేడు కూడా మరో ఇద్దరికి కొత్త స్కూలు చూడాలి.... డొనేషను ఎంత కట్టాలో? అదిగాక ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు....తలుచుకొంటేనే ఒళ్లు వేడెక్కిపోతోంది....

జానకి ధోరణి అతనికి అంతుపట్టటం లేదు! చెప్తే అర్థం చేసుకొని వినే రకం కాదు! ప్రతి విషయంలో ఇద్దరికి చెరో అభిప్రాయమే! ఉత్తర, దక్షిణ ధృవాల్లాంటి ఆలోచనలు...అభిప్రాయాలు....

"రెండేళ్ళకోసారైనా పుట్టింటి కెళ్ళాలిట" ఇదీ జానకి ఉద్దేశం...చిన్నప్పటి స్నేహితులకు ఇప్పుడు కూడా ఉత్తరాలు రాస్తుంది! పెళ్ళయి, పిల్లలు పుట్టి, ఎవరి సంసారాల్లో వాళ్లు పడి సతమతమవుతూ వుంటే ఏమిటీ ఉత్తరాలు! ఎన్నోసార్లు వారించబోయాడు చంద్రశేఖర్! "నువ్వు ఉత్తరాలు రాయటంవల్ల మీ ఫ్రెండ్సు విసుక్కుంటారు! వాళ్ళచేత అనవసరంగా ఖర్చు పెట్టిస్తున్నావు...నాలుగు రాస్తే ఒకటో రెండో రాస్తున్నారు! దీన్నిబట్టైనా అర్థం చేసుకో....పోస్టేజి ఖర్చు దేనికి?" అంటూ!

"మా నాయనమ్మ కల్లోకి వస్తోందండీ—చూడాలని వుంది! అన్నయ్యలు, వదినలు, అక్కయ్యలు వస్తున్నారు! ఈ రూపంగానైనా అందర్నీ చూడొచ్చు!" జానకి చెప్పింది వూరికెళ్ళే కారణంగా!

"ఆవిడకు పెద్ద వయసు. ఏవో నలతలు, అనారోగ్యం తప్పవు. ఈ కారణంగా అనవసరపు ఖర్చు దేనికి! రేపు వాడొచ్చి, బాకీ తీర్చమని గోల పెడితే యీ జనాభాలో ఎవరైనా ఆదుకుంటారా? జీవితంలో వచ్చే కొన్ని ఎదురు దెబ్బలకు అంతగా ప్రాముఖ్యత యివ్వగూడదు. ముందు మన గురించి చూసుకోవాలి....రోజులెలా వున్నాయి?" చంద్రశేఖర్ వివరించాడు.

"నాయనమ్మను బతికుండగా చూడాలని వుంది"

"ఈ బంధాలు, ప్రేమలు, అభిమానాలు, ఆప్యాయతలకు అర్థం పర్థం లేవు. వాటికి విలువ లేని రోజులు. ఇతరుల కోసం మనం ఆరాట పడేముందు మన కోసం వాళ్ళు ఎంత తాపత్రయ పడుతున్నారన్న విషయాన్ని గ్రహించాలి. జీవితంలో బరువు బాధ్యతలు పెరుగుతున్నప్పుడు, వయసు అనుభవం పిల్లలతో పాటు ఎదుగుతున్నప్పుడు-యిలా అభిమానాలు, ఆప్యాయతలు అంటూ ఖర్చులు పెంచుకోటంలో అర్థం లేదు. మనసులో వుంటే చాలు. ఎదురుగా వెళ్ళి కావలించుకుని ఏడ్చేసి నటించటం అనవసరం... కాని యీ రోజుల్లో నటనకే, మొసలి కన్నీళ్ళకే నీలాటివాళ్ళు కరిగిపోతున్నారు .... కలికాలం..." చంద్రశేఖర్ మరింతగా విపకించి చెప్పినా ప్రయోజనం లేకపోయింది.

అసలీ రోజుల్లో మనిషికి మరోమనిషి బరువు. భరించటం కష్టం. చంద్రశేఖర్‌కి యిప్పటికీ గుర్తే...ఆ రోజు. అంటే పెళ్ళి జరిగిన మరునాడు—అనుకున్న మాటల ప్రకారం పెళ్ళికొచ్చిన జనం విడిది యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోవాలి. భోజనాలు, టిఫిను, కనీసం కాఫీలు కూడా జానకి తండ్రికి సంబంధం లేదు. కాని కాంట్రాక్టు బస్సుకి రిపేరు వచ్చి దారిలో ఆగిపోయింది. దాదాపు మూడు నాలుగు గంటల ఆలస్యం అయింది వచ్చేందుకు. అప్పటికి జానకి తండ్రి కాఫీ టిఫిన్లు ఏర్పాటు చేసాడు. టైము పదకొండు గంటలు అయింది...భోజనాల టైము అయింది...

ఈలోగా మధ్యవర్తి వెళ్ళి భోజనం ఏర్పాటు చేయమని అర్థించాడు. "క్షమించండి...ఇప్పటికే అనుకున్న ప్రకారంకంటే అదనంగా కాఫీ, టిఫిన్లు అందించాను. ఇంక భోజనం అంటే నావల్ల కాదు. మీరే ఏదైనా ఏర్పాటు చూసుకోండి" అంటూ చేతులు జోడించాడు ఆ తండ్రి నిర్మొహమాటంగా.

ఎవరి దారి వారు చూసుకున్నారు. ఇప్పటికీ ఆయన తత్వం అంతే. ఇంటికెవరొచ్చినా భయపడిపోయి. బి.పి. పెంచుకుంటాడాయన....కొడుకులు, కూతుళ్లు,



ఎవరొచ్చినా అంతే!

ఎన్నో ఆలోచనలతో అసలు సమస్యకు పరిష్కారం దొరకటం లేదు. ప్లాట్‌ఫారం మీదకు వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళు ఇంక రైల్వే లైన్లమీదకు ఏవో రైళ్ళు వస్తూనే వున్నాయి....పోతున్నాయి...మరికొన్నింటిమీద అలాగే నిలిచిపోతున్నాయి. చంద్రశేఖర్ కిదంతా ఆశ్చర్యంగా, వింతగా వుంది. తను రైల్వే ఉద్యోగంలోనే వుండిపోవాల్సింది. ఈ ఉద్యోగంలో ఎదుగు బొదుగు లేదు. నెల నెలా జీతం....ఏడాదికోసారి ఇంక్రిమెంటు. అప్పుడప్పుడు ప్రభుత్వం దయతలచి ప్రకటించే కరువు భత్యం....అంతకు తప్పించి మరేం లేదు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పాసయితేనే ప్రమోషను. అది ఓ పెద్ద గండం. నాలుగుసార్లు ప్రయత్నించి ఓడిపోయాడు. ఆ తరువాత బద్ధకం అశ్రద్ధ....

తాను రైల్వేలోనే వుండిపోతే యీపాటికి హెడ్‌క్లర్కు అయిపోయేవాడు. మూడవ వేతన సంఘం సిఫార్సు, రైల్వేల ఆధునీకత, విస్తరణ, అభివృద్ధి వల్ల ఉద్యోగులకు బాగా లాభం, ప్రయోజనం కలిగిందని అప్పటి స్నేహితుల ద్వారా తెలిసి-చేసిన తెలివి తక్కువ పనికి నాలుగైదు రోజులు విచారించేవాడు చంద్రశేఖర్. కనీసం జానకికైనా రైల్వే ఉద్యోగం బాగా ఉపయోగకరంగా వుండేది-తన ప్రయాణాలకు ఖర్చు తప్పేది, పాసులుండటంవల్ల ....

విజయవాడ-హైదరాబాదు జీవితాలకు ఎంతో వ్యత్యాసం వుంది. అందులో యిప్పుడు విజయవాడ ఎంతో అభివృద్ధి చెందిందిట... ఆరేడేళ్ళయింది వెళ్ళి.... పాత స్నేహితులని చూసి....అతనికి ముఖ్యంగా కళ్యాణిని చూడాలని వుంది.

"నువ్వేదో నమ్మకస్తుడవని నమ్మి, డబ్బు చేతిలో పెట్టాను. ఇప్పుడు ఇవ్వలేనని అంటే నేను ఏ రైలుకింద పడాలి! నా ఖర్చులు, అప్పులు ఎవరితో చెప్పుకోను!" స్నేహితుడు అడుగుతున్నట్టుగా అనిపించింది చంద్రశేఖర్‌కి.

ఉలిక్కిపడ్డాడు అతను.

"నో. నో ...అటువంటి పరిస్థితి రాదు...కలగదు.....నమ్మి చేతిలో డబ్బు వుంచిన స్నేహితుడిని మోసగించకూడదు. ప్రయత్నాలు మరింత గట్టిగా చేసైనా అయిదువేలు యిచ్చేసేయాలి" స్వగతంలో అనుకున్నాడు.

తృప్తి, ఆనందం, హాయి, సంతోషం-ఇవి మనుషులకు రకరకాలుగా వుంటాయి. కాని చంద్రశేఖర్‌కి మాత్రం యిటువంటి కష్టాల్లో, ఆపదల్లో, సమస్యల్లో-తృప్తినిచ్చినా....ఆనందం, హాయి యిచ్చేది....సంతోషంగా వుండేది ఒకే ఒక్క మనిషి—

కళ్యాణి! ఆమె పరిచయం...ఆమెతో స్నేహం....ఆమె ప్రేమ....ఆమె తీయని మాటలు....అందమైన రూపం....ఆకర్షణగా వుండే ముఖారవిందం....

కాసేపు యీ బాధలు, ఖర్చులు, అప్పులు, యిబ్బందులు అవతలపెట్టి కళ్యాణి రూపాన్ని కళ్ళముందు నిలుపుకున్నాడు చంద్రశేఖర్. పరిచయం, గతం సినిమారీలులా తిరగసాగింది.

ఆలోచనల్నుంచి తేరుకునేసరికి ప్లాట్‌ఫాం యింకా సందడిగానే వున్నట్లు గ్రహించాడు చంద్రశేఖర్. ఎక్కడ చూసినా జనమే...రైలుస్టేషన్లు, బస్టాండ్లు, రోడ్లు, సినిమాహాళ్ళు, ఆసుపత్రులు, స్మశానాలు-ఒకటనేమిటి! అందుకే కాబోలు ఫామిలీ ప్లానింగు గురించి యింత ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు? అయినా పుట్టుకొస్తూనే వున్నారు, అదుపు అడ్డు లేకుండా.

చంద్రశేఖర్ టైము చూశాడు ..చాలా టైమయిందే అనుకున్నాడు! ఇంటి వైపు దారిపట్టాడు. తన సమస్యకు పరిష్కారం లభించలేదు.

బస్టాండులో నిలబడ్డాడు. వెంటనే ఏదో బస్సు వచ్చింది. ఎక్కి కూర్చున్నాడు. అరగంట తర్వాత యిల్లు చేరాడు చంద్రశేఖర్.

"ఇంతవరకూ ఎక్కడికెళ్లారు? ఇల్లు, సంసారం పట్టించుకోకుండా అలా రోడ్లవెంబడి తిరిగితే ఏం లాభం? మీ ఫ్రెండు వచ్చి వెళ్ళాడు...మీరొచ్చాక యింటికి రమ్మనమని చెప్పాడు" జానకి విసుగుతోనే అంది.

అతను చూపులు నిల్పలేకపోయాడు. డబ్బుకోసమే వచ్చి వుంటాడు. లేకపోతే తనమీద ప్రేమతో ఎవరొస్తారు? మరోసారి చేస్తున్న ప్రయత్నాలు గుర్తుకు వచ్చాయి.

"ఇంతకీ డబ్బు గురించి ఏం ఆలోచించారు" అడిగింది జానకి.

"ఏమీ ఆలోచించలేదు. అదే ప్రయత్నంలో వున్నాను. అయిదువేలు కాదు కదా అయిదు వందలు కూడా దొరికేలా కనపడటం లేదు. అతనికి ఎలా ఇవ్వాలో అర్థం కావటం లేదు." భార్యమీద కోపంగా వున్నా పైకి మాత్రం ఏమీ ప్రదర్శించలేక సౌమ్యంగానే చెప్పాడు అతను.

"ఓ పని చేయండి...రేపొద్దున్నే వాళ్ళింటికెళ్ళి మూడునెలల టైము ఇమ్మనండి. ఈలోగా ఏదో చూడొచ్చు" సలహాగా చెప్పింది జానకి.

"నేను అడగను. బాగోదు" నిశ్చయంగా అన్నాడు చంద్రశేఖర్.

"ఇంతకీ చిట్‌ఫండు ప్రయత్నం ఏంతవరకూ వచ్చింది?"

"అది కూడా ఫలించేలా లేదు. సాక్షులే కరువయ్యారు. ఒక్కడే సంతకం చేస్తానన్నాడు. మరో సంతకం వాళ్ళ ఫ్రెండు చేత చేయిస్తానన్నాడు, రెండు వందలు యిస్తే. లేదంటే వాళ్ళావిడకు కుట్టు బేరాలు యిప్పించమన్నాడు. సరే అన్నాను. నీకెటూ బేరాలు రావు. ఆ వచ్చినవాళ్ళని వాళ్ళింటికి పంపిస్తే సంతోషిస్తుందా యిల్లాలు. మనకి తృప్తిగానూ వుంటుంది"

భర్త మాటలు జానకిలో చిన్నచూపు కలిగించినా, ప్రస్తుత పరిస్థితుల్లో యిదే మంచిదనిపించింది.

"అనవసరంగా మీరు చిట్‌లో చేరతానంటున్నారు. నెలనెలా మనం చిట్ డబ్బు కట్టలేము...కాబట్టి వెళ్ళి మీ నాన్నగారిని అడగండి" అంది జానకి—ఏదో బృహత్తర ప్రణాళికను పరిష్కరించిన ధోరణిలో.

చంద్రశేఖర్‌కి తండ్రి దగ్గరకు వెళ్ళటం యిష్టం లేదు. జానకి చేసే దుబారా ఖర్చులు, ఆర్భాటాలు, ఆయనకు నచ్చవు. వారించమని ఎన్నోసార్లు కొడుకుతో చెప్పాడాయన. కాని ఫలితం లేకపోగా మరింతగా ఖర్చుచేస్తూ వుండటంతో అప్పులు పెరిగాయి. తన అప్పులని తండ్రిని తీర్చమని అడగటంలో అర్థం పర్థం లేదు.

చాలాసేపు ఆలోచించాక, యింతకన్నా వేరే మార్గం కనిపించలేదు. మర్నాడు పొద్దున్నే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వెళ్ళేందుకు నిశ్చయించుకున్నాడు. కంచం ముందు కూర్చున్నాడు, భోజనం చేసేందుకు.

ఎల్లాగో అయిందనిపించాడు.

మళ్ళీ ప్యాంటు, షర్టు వేసుకొని స్నేహితుడింటికి బయలుదేరాడు. చంద్రశేఖర్ వెళ్ళేసరికి అతను రేడియో వింటున్నాడు.

"ఎంత హాయిగా బతుకుతున్నావయ్యా...రేడియో వినటం మాట దేవుడెరుగు, టి.వి. చూసి ఎన్ని రోజులయిందో నాకు" స్వగతంలో అనుకున్నాడు చంద్రశేఖర్.

"దరిద్రుడి పెళ్ళికి వడగళ్ళ వాన అన్నట్లుగా, సరిగ్గా నా వంతు వచ్చేసరికే బడ్జెట్ అయిపోయిందట...కాబట్టి యీ ఏటికి ఇల్లు కట్టే యోగం లేదు. అసలుందో లేదో! మళ్ళీ ఏటికి పరిస్థితి ఎలా వుంటుందో...గుడ్డిలో మెల్ల అన్నట్లుగా నాకు భూటాన్ డిప్యుటేషను వచ్చింది. రెండేళ్లు. వెళ్ళేందుకే నిశ్చయించుకున్నాను. బహుశా వారం పదిరోజుల్లో ఆర్డర్సురావచ్చు" అన్నాడా స్నేహితుడు.

చంద్రశేఖర్‌కి మనసులో ఆనందంగానే వుంది. కాని పైకి మాత్రం "నీ డబ్బు వారం రోజుల్లో రెడీ అవుతుంది" అన్నాడు.

"ఇంకెందుకులేవయ్యా యిప్పుడు....ఖర్చయిపోతుంది....నీదగ్గరే వుంచు. మీ ఆవిడ యిందాక ఏవో అప్పుల గురించి చెప్పింది. అనవసరంగా వడ్డీలు ఎందుకు చెల్లిస్తావ్! ప్రస్తుతం అవసరం లేదులే నాకు....ఈ డిప్యుటేషనువల్ల నాలుగు వందలు ఎక్కువ వస్తాయి. పైగా భూటాన్‌లో క్వార్టరు యిస్తారుట. ఖర్చు కూడా అంత వుండదు"

"ఓ పని చేయి. నీ బాంకు ఎకౌంట్ నెంబరు యిస్తే, డబ్బు క్రెడిట్ చేస్తాను. నా దగ్గర డబ్బు నిలవ వుండే ప్రసక్తే లేదు" అన్నాడు చంద్రశేఖర్ స్నేహితుడి మాటలకు బదులుగా.

"వద్దులేవయ్యా ...నీ దగ్గరే వుండనీ" అన్నాడు అతను.

"బై ది బై, యీ విషయం జానకితో చెప్పావా?"

"లేదు. నాకుమాత్రం తెలియదా!"

"అలా అని కాదులే....ప్రస్తుతం నీ డబ్బు గురించే ప్రయత్నిస్తున్నాను. నువ్వు యీ విషయం జానకితో చెప్పావంటే నా పని అయినట్లే... ప్రస్తుతం డబ్బు దొరగ్గానే, దానితో ఇంటికి రంగులు, బయట నాపరాళ్ళు వేయించమంటుంది. ఇంటికి ఎంత ఖర్చు పెట్టినా ఇంకా ఏదో మిగులుతూనే వుంటుంది. రేపు మా నాన్న దగ్గరకెడుతున్నాను" అన్నాడు చంద్రశేఖర్.

"అంత హడావిడి ఏం వచ్చిందని...తీరుబడిగా యివ్వొచ్చుగా" చెప్పాడు స్నేహితుడు.

"అలా అనకు. ప్రస్తుతం చేస్తున్న ప్రయత్నం కొనసాగాలి. ఈ వేడి చల్లారిపోతే మళ్ళీ వేడెక్కదు. అదృష్టం బాగుండి డబ్బు దొరికితే వెల్ అండ్ గుడ్. నీకే యిచ్చేస్తాను. లేదంటే నీ ఎకౌంటులో వేస్తాను. కాబట్టి నెంబరు చెప్పు"

"నీకు ముందే చెప్పాను. మళ్ళీ మొదటికే వచ్చావు నువ్వు. నాకు ఎకౌంటు లేదు."

"మీ ఆవిడ ఎకౌంటు వుందిగా"

"ఆ పని మాత్రం చేయకు. నీ ధోరణి చూస్తుంటే అయిదువేలు హారతి కర్పూరంలా ఖర్చు చేయించేట్టుగా ఉన్నావు. సరే, యీ నెంబరులో క్రెడిట్ చేయి" అంటూ నెంబరు చెప్పాడు అతను.

చంద్రశేఖర్ ఇంటి కెళ్ళిపోయాడు.

మర్నాడు పొద్దున్నే విజయవాడ వెళ్ళిపోయాడు అతను,

* * *

వినాయకుడి పెళ్ళికి అన్నీ విఘ్నాలే అన్నట్టుగా, చంద్రశేఖర్ వెళ్ళేసరికి తల్లి, తండ్రి ఢిల్లీ కూతురి దగ్గరకు వెళ్ళారని పక్కవాళ్ళు చెప్పారు.

"హతోస్మి" అనుకున్నాడు.

ఏం చేయాలో తోచటం లేదు.

చంద్రశేఖర్‌కి 'కళ్యాణి' గుర్తుకొచ్చింది. ఎన్నో ఏళ్ళు అయింది ఆమెను

చూసి. ఓసారి చూడాలనిపించింది.

అంతే, ఆలోచన రావటమే తరువాయి. వెంటనే బయలుదేరాడు.

ఆఫీసు భవనాలు ఎంతో మారిపోయాయి. కొత్తవి కొన్ని... పాతవాటి స్థానంలో మరికొన్ని...తిన్నగా తాను పనిచేసిన ఆఫీసువైపు నడిచాడు. ఓసారి గుమ్మం దగ్గర నిలబడి లోపలకు చూసాడు. కొత్త ముఖాలు...అక్కడక్కడ పాత ముఖాలు, నెరిసిన జుట్టు, ముడతలు పడ్డ ముఖాలు—మొత్తానికి గుర్తు పట్టినా ఎవరూ అతన్ని పలకరించలేదు. అదో చెంపదెబ్బగా తోచింది.

కళ్యాణి కూడా ఇలాగే ప్రవర్తిస్తుందేమో...

అప్పుడేం చేయాలి? మనుషులు దూరంగా వుంటే అభిమానం పెరుగుతుందిట....కాని ప్రస్తుతం వేరేగా కనిపిస్తోంది...

ఏదో పాత ముఖం కనిపిస్తే పలకరించబోయాడు...కాని నిరాశే మిగిలింది. ఎరగనట్టు, చూడనట్టు, హడావిడిగా వెళ్ళిపోయాడు ఆ మానవుడు.

మొత్తానికి కళ్యాణిని గుర్తుపట్టి దగ్గరకు వెళ్ళాడు.

కొన్ని క్షణాలు ఇద్దరి కళ్ళు మూగగా పలకరించుకున్నాయి. ఆనంద బాష్పాలు నాలుగుకళ్ళు వర్షించాయి.

'కళ్యాణి ... హెడ్ క్లర్క్' అన్న నేం ప్లేటు గోడకి తగిలించబడింది. చంద్రశేఖర్ చూసి సిగ్గుపడ్డాడు అందుకే ముందే తను పలకరించాడు, "బాగున్నారా" అంటూ.

"కూర్చోండి ...ఏమిటిలా వున్నారు! వంట్లో బాగుండటం లేదా" కళ్యాణి ఆప్యాయంగా అడిగింది.

"బాగానే వున్నానుగా...," అంటూ తనవైపు చూసుకొన్నాడు అతను. అయిదు నిముషాలు ఇద్దరిమధ్య పలకరింపులు.... యోగక్షేమ విచారణ....

"అప్పుడు వెళ్ళి యిప్పుడు కనిపిస్తున్నారు...న్యాయమేనా?" అంది ఆమె.

"కాదు ...నేను నాలుగుసార్లు వచ్చినా కలవలేకపోయాను. విజయవాడ వచ్చి చాలా ఏళ్ళయింది. ఇప్పుడు ఓ అర్జంటు పనిమీద వచ్చాను. కాని ఆఫీలోనే హంసపాదు అన్నట్టయింది...." అంటూ తల వంచుకున్నాడు చంద్రశేఖర్.

"మీ ఆవిడ. పిల్లలు అంతా బాగున్నారా. ..హైదరాబాదులో యిల్లు కట్టుకున్నారట..." కళ్యాణి అడుగుతోంది.

"ఈ విషయం ఎవరు చెప్పారు?"

"మీరు రైల్వే వదిలి వెళ్ళిపోయినా, మీ నాన్నగారు యిక్కడే పని చేస్తున్నారుగా ...ఆయనే ఆమధ్య చెప్పారు"

"అదే నేను చేసిన పొరపాటు ...ఏదో ఎగువ తరగతి గుమస్తా ఉద్యోగం అని వెళ్ళాను ..అంతే ఎదుగూ బొదుగూ లేదు ...మరో చేసిన పొరపాటు యిల్లు కట్టటం...ఇంతకీ మీవారు... పిల్లలు బాగున్నారా?"

"మా అమ్మకి తగిన శాస్తే జరిగింది. నాకు మా సినిమా బావతో పెళ్ళయింది. అదో దిక్కుమాలిన ప్రపంచం ..ఎదుగులేని జీవితం అది. ప్రొడ్యూసర్లు డబ్బు యివ్వటం దేవుడెరుగు.... వేషాల కోసం ఎదురివ్వటం....దానితో నేను డబ్బు యివ్వటం...ఏమైమేదేళ్ళు మద్రాసు—విజయవాడ మధ్య వ్యవహారం నడిచింది...బహుశా దేవుడికి మామీద కన్ను కుట్టి వుంటుంది. నా సౌభాగ్యాన్ని మరి దృష్టం వరించింది" కళ్యాణి చెప్తూనే వుంది నిర్లిప్తంగా.

"ఇంతకీ పిల్లలెంతమంది?" అడిగాడు చంద్రశేఖర్.

"ఇద్దరమ్మాయిలు...."

"ఇద్దరం ఒకే విధంగానే వున్నామన్నమాట...." చటుక్కున నోటినుంచి వచ్చేసాయి ఆ మాటలు...

"అంటే" అర్థం కాలేదామెకు.

"నాకు నలుగురు కూతుళ్ళు..."

తెల్లమచ్చలు

కొత్త పరిశోధన! తెల్లమచ్చలు, ఇతర చర్మవ్యాధులు వున్నవాళ్ళు బాధపడనవసరం లేదు. అట్టివారి వివరాలు ఇంగ్లీషులో తెలిపి రెండు చిన్నసీసాల మందు వుచితంగా పొందండి మా మందు వాడక మీరు ప్రారంభించగానే మీ తెల్లమచ్చలు మాయమవడ ప్రారంభమగును చాలామంది ఈ విధమైన నివారణ పొందారు. మీరూ ప్రయత్నించి లాభం పొందండి. అర్హతలు, అనుభవం వున్న వైద్యునిద్వారా చికిత్స పొందండి

తెల్లవెంట్రుకలు

హేర్ డైతో కాదు. మా ఆయుర్వేద నూనెతో చిన్న వయస్సులో వెంట్రుకలు తెల్లపడటం ఆటంకపర్చవచ్చును. మొదలునుండే నల్ల జుట్టు రావడం మొదలై. జుట్టుని తెల్లపడనీయకుండా కాపాడును. ఈ నూనె కళ్ళకి. మెదడునకు లాభదాయకమైనది వేలమంది లాభం పొందారు. ఈ చికిత్సద్వారా మీకు ఫలితం దక్కనిచో మీ డబ్బు వాపస్ ఇవ్వబడును. ఒకసారి ప్రయత్నించండి ఒక చిన్నసీసా వెల రూ॥ 14/– మూడు సీసాల వెల రూ॥ 40/– మూడు సీసాలకి ఒకేసారి ఆర్డర్ యిస్తే ఒకసీసా ఉచితం.

Hind Ayurved Bhavan (B.H. 3)
P.O. Karti Sarai (GAYA) India.

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్ల మచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం

"డాగ్ వినాశక్"

వాడినయెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

Address
M/s. SAMAJ KALYAN (R.L.) - 15
P. O. KATRI SARAI (GAYA). Pin. 805 105

"ఇదేనేమో చిత్రం అంటే....మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నా కనీసం ఓ మగపిల్లాడు పుట్టేవాడేమో....ఇటు జీవితం అటు మారేదేమో...." పమిటతో కళ్ళు తుడుచుకుంది కళ్యాణి.

పావుగంటసేపు యిద్దరూ ఎంతో ఆప్యాయంగా కబుర్లు చెప్పుకున్నారు. పాత స్నేహితులందరి గురించి అడిగాడు. కొందరు ట్రాన్స్ఫరు అయ్యారు, మరి కొందరు చనిపోయారు. ఇంకొందరు సస్పెండయ్యారు... ఇలా వుంది అక్కడి పరిస్థితి...

"ఈ రాత్రికి మా ఇంటికి రండి..." అంది కళ్యాణి.

చంద్రశేఖర్‌కి వెళ్లాలనే వుంది. అంతలోనే అయిదువేల అప్పు గుర్తు రావటం.... స్నేహితుడితో జరిగిన సంభాషణ. తల్లి తండ్రి ఢిల్లీ వెళ్ళటం చికాకు కలిగించింది. ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? నేను పరాయిదాన్ననా?" చిరుకోపం ప్రదర్శించింది కళ్యాణి.

"అబ్బే అదేం లేదు....కాని అర్జంటుగా వెళ్ళిపోవాలి' అని మాత్రం అన్నాడు.

"డబ్బు గురించేనా బెంగ"

ఆశ్చర్యపోయాడు చంద్రశేఖర్ ఎలా తెలుసు అన్నట్లుగా.

"నాకు మన పరిచయం, స్నేహం, మీ మాటలు యిప్పటికీ గుర్తే....మీరు డబ్బు గురించి వర్రీ అవుతున్నారేమో... పెరిగే ధరలు, పెరగని జీతం, ఖర్చులు నగర జీవితం, పైగా యిల్లు కట్టటం ...అందులో ఆడపిల్లలు . ఆమాత్రం గ్రహించలేనా?" కళ్యాణి మాటలు అప్పటికీ యిప్పటికీ ఒకేలాగున్నాయి.

సరే అన్నాడు.

"ఇదిగో సబ్బు, టవెల్. టాయిలెట్‌కెళ్ళి ముఖం కడుక్కొని రండి" అంటూ సబ్బు, టవెల్ అందించింది ఆమె!

ఇబ్బందిగానే అందుకున్నాడు వాటిని.

పది నిముషాలు.... గడిచాయి.

"భోజనం చేయలేదనుకుంటాను" అంది ఆమె.

"ఇప్పుడు భోజనం ఏమిటి....అయినా మిమ్మల్ని చూసేక ఆకలే వేయడం లేదు. ఏకంగా రాత్రి చేస్తాను" ఎల్లాగో అన్నాడు చంద్రశేఖర్.

"భలేవారండీ మీరు ...జీవితం అంటే ఏమిటి...పొద్దున్నే లేవగానే దంత ధావనం, కాఫీ, భోజనం, మధ్యాహ్నం కాఫీ, టిఫిను, రాత్రి మళ్ళీ భోజనం, పడుకునే ముందు 'అది'—ఇందులో ఏది లేకపోయినా రోజు వెళ్ళినట్టు వుండదు అని మీరు చెప్పేవారు. మరిచిపోయారా" అంటూ గుర్తు చేసింది కళ్యాణి.



అతనిలో ఇంకా ఆశ్చర్యం పోలేదు.

కళ్యాణి సెలవుచీటీ రాసి ఆఫీసరుకు పంపించింది.

ఇద్దరూ యింటి కెళ్ళిపోయారు.

* * *

"రోజూ టేపు రికార్డరులో పాటలు వింటున్నారా?" వడ్డిస్తూ అడిగింది కళ్యాణి.

"ఏం పాటలో కళ్యాణీ....ఆ జీవితం ఎప్పుడో పోయింది. ఇప్పుడు నా జీవితం నాకే భయంగా, చికాకుగా వుంటోంది. ఏమయిపోతుందో అన్న ఆందోళన నన్ను అనుక్షణం వేధిస్తుంది. అందులో నలుగురూ ఆడపిల్లలే! పైగా జానకి దుబారా మనిషి....మా యిద్దరికీ ఏ విషయంలోనూ పొత్తు కుదరదు. నా మాట చెల్లదు. ఎందుకీ బతుకు?" చంద్రశేఖర్ అన్యమనస్కంగానే చెప్తున్నాడు.

"చదువుకున్నవారు, మీరే యిలా భయపడితే ఎలాగ! ఆ రోజుల్లో మీరు ఎంత ధైర్యంగా, చలాకీగా వుండేవారూ! జీవితం అంటే ఓ సాగరం ...అందులో ఆటుపోటులే కాదు, తుఫానులు కూడా వస్తుంటాయి. ఇంకా మీరు ఏమనేవారో గుర్తుందో లేదో?" ఓ క్షణం ఆగింది ఆమె.

భోజనం ముగించి లేచాడు అతను.

కళ్యాణి వక్కపొడి అందించింది.

"ఏం అనేవాడిని?"

"అప్పుడే మరిచిపోయారా—జీవితం రైల్వే ప్లాట్‌ఫారం లాటిది. ఏవో రైళ్లు వస్తూ పోతూ వుంటాయి... ఎప్పుడూ రద్దీగా వుండే ప్లాట్‌ఫారానికి అందం నిండుతనం...అలాగే జీవితాలు కూడా....ఖర్చులు, సమస్యలు, యిబ్బందులు ఎదురవుతుంటాయి....భయపడిపోతే ఎలా అని చెప్పేవారుగా!" అందామె.

"నిజమే కళ్యాణీ ...కాని నేను తలకు మించిన అప్పులు చేసాను. నా కోసం చేస్తే నేను అంతగా బాధపడను. జానకి తన గొప్పల కోసం, మెప్పుల కోసం, సర్టిఫికేట్ల కోసం, యితరుల దృష్టిలో హుందాగా కనిపించేందుకు నాచేత అప్పు చేయించింది. ఇప్పుడు ఆ బాకీలు ఎలా తీర్చాలో అర్థం కావటం లేదు" అంటూ అయిదువేల గురించి చెప్పాడు చంద్రశేఖర్.

కళ్యాణి చక్కగా నవ్వింది.

"నువ్వు కూడా నవ్వుతున్నావా కళ్యాణి" సిగ్గుపడుతూ అన్నాడతను.

"లేదండి.... చేతివేళ్ళల్లాగే మనుషుల్లో ఎన్ని రకాలు! ఎవరి అభిప్రాయం, ఆలోచన, దృష్టి వారిదే' నిశ్చయంగా అంది ఆమె.

ఏం చెప్పాలో అర్థం కాలేదు అతనికి.

అంతలో కళ్యాణి పిల్లలిద్దరూ స్కూలునుంచి వచ్చారు. "ఇది సీనియరు, అది జూనియర్" అంటూ పరిచయం చేసింది కళ్యాణి.

"నమస్తే అంకుల్" అన్నారిద్దరూ ఏకకంఠంగా.

ఆశ్చర్యపోతూ యిద్దర్నీ దగ్గరకు తీసుకుని, పేరు, చదువు, స్కూలు గురించి అడిగాడు జేబులోనుంచి రెండు పది రూపాయల నోట్లు తీసి వారి చేతిలో పెట్టాడు. "వద్దు అంకుల్" అంటూ తల్లివైపు చూసారు వాళ్ళు!

"ఇదేం బాగోలేదండీ" అంది కళ్యాణి!

"పిల్లలు! వారికేం తేలేకపోయాను....అయినా నీకేం ఇవ్వటం లేదుగా.... ఏదో కృష్ణుడికి కుచేలుడు అటుకులు యిచ్చినట్లుగా, చంద్రుడికో నూలుపోగు అన్నట్లుగా..." చంద్రశేఖర్ సంజాయిషీగా చెప్పాడు!

పిల్లలు లోపలకు వెళ్ళిపోయారు!

కళ్యాణి టేపురికార్డరు తెచ్చి కేసెట్ పెట్టి ఆన్ చేసింది! మంచిపాట....ప్రేమమయం....శృంగారం నూరుపాళ్ళు రంగరించి పోసినట్లు వున్న పాట అది!

కాని అతనికి వినాలనిపించటం లేదు!

కళ్యాణి, చంద్రశేఖర్ అన్యమనస్కంగా వున్నట్టు గ్రహించింది. ఆ మాటే అడిగింది.

"నేనెంతో బతికున్నానంటే కేవలం విజయవాడలో పెరగటం, నీ చేతి మీదుగా రైల్వే ఉద్యోగంలో చేరటం.... మన పరిచయం-తరచు గుర్తుకు తెచ్చుకుని ఆ కాసేపైనా బాధలు మర్చిపోతుంటాను...." అన్నాడు అతను.

"అందుకే కాబోలు ఒక్క ఉత్తరం అయినా రాయలేదు" ఎగతాళి చేస్తున్నట్టు అందామె.

"నువ్వు మనస్ఫూర్తిగా అంటున్నావా... అయినా ఒకరి భార్యవు. ఎలా రాయను... ఏం బాగుంటుంది...." అన్నాడు అతను.

కళ్యాణి ఏం బదులు చెప్పలేదు.

ఇద్దరిమధ్య రెండు గంటలసేపు కబుర్లు దొర్లాయి. వారికి ఎంతో తృప్తిగా వుంది. కాని ఏదో బలహీనత...

చంద్రశేఖర్‌కి మళ్ళీ అప్పులు ...ఖర్చులు...బాకీలు గుర్తుకు రాగానే మనసంతా ఏదో బాధ, బెంగ ఆవరించేసినట్లయింది.

"నేను రాత్రి గోదావరి కెళ్ళిపోతాను" వెళ్ళాలని లేకపోయినా అనక తప్పలేదు అతనికి.

"తప్పదంటే మీ యిష్టం" కళ్యాణి కూడా ఇబ్బందిగానే చెప్పింది.

ఆ రాత్రి రైలుకే చంద్రశేఖర్ హైదరాబాదు వెళ్ళిపోయాడు.

• • •

అయిదో రోజున చంద్రశేఖర్‌కి కళ్యాణినుంచి ఉత్తరం వచ్చింది. అది కవరు. ఆత్రంగా, ఆశ్చర్యంగా విప్పి చూసాడు. అందులో ఒక బాంకు చెక్కు, ఉత్తరం వున్నాయి.

పదివేల రూపాయలకు రాయబడిన చెక్కు!

అతని కళ్ళు ఉత్తరం వెంబడి పరుగెట్టాయి.

శ్రీ చంద్రశేఖర్‌గారికి, వెంటనే ఉత్తరం రాస్తున్నందుకు ఏమీ అనుకోరు కదూ....నా పొరపాటో, గ్రహపాటో, లేక ముందు చూపో-నా భర్త ప్రొడ్యూసర్లు యిచ్చిన డబ్బునుంచి యిది మాత్రం ఎల్లాగో దాచుకోగలిగాను. పదహారు వేలకు మిగిలింది యిది మాత్రమే....అందులో అయిదువేలు మా అక్క తీసుకుంది. తిరిగి రాదని తెలుసు. నా దగ్గర యింకా వుందని ఎవరెవరో వచ్చి ఉచ్చులు వేయసాగారు. చెరువులో నీళ్ళుంటేనే కప్పలు, చేపలు చేరతాయిట .. బెల్లం చుట్టూ ఈగలు ముసురుతాయట....అది నిజమో కాదో తెలియకపోయినా—డబ్బుంటే మాత్రం మనుషులకు ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు మాత్రం పెరుగుతాయని గ్రహించాను.

డబ్బు దాచటం చాలా కష్టమైందని నా అనుభవంలో గ్రహించాను. గతంలో నాలుగైదుసార్లు మీ నాన్నగారు కనిపిస్తే, మీ అడ్రస్సు అడిగి మీకు ఈ డబ్బు పంపించాలనుకున్నాను. కాని ఆయన ఏమనుకుంటారోనని భయపడ్డాను. ఈ లోకంలో నాకు మిగిలిన ఆప్తులు, స్నేహితులు మీరే! దేవుడిలా కనిపించారు. అదే పదివేలుగా భావించి యీ పదివేలను నా దేవుడి దగ్గర భద్రపరచాలని భావించాను. ఈ డబ్బు నా పిల్లల కోసం ఎల్లాగో ఉపయోగించాలి. ఇంకా ఆరేడేళ్ళ మాట కదా...

మనిషికి డబ్బుకి మించిన విచారం, మనోవ్యాధి మరొకటి వుండదేమో... ప్రస్తుతం మీ యిబ్బందులు, ఖర్చులు యీ స్వల్ప మొత్తంతో తీరితే, ఉపయోగించుకోవచ్చు. ఇలా రాసినందుకు మరోలా భావించకండి. హటాత్తుగా వచ్చి మాత్రం డబ్బు ఇమ్మని మిమ్మల్ని అడగను. మరో విషయం....మీకెప్పుడు డబ్బు అవసరమైనా, ఈ కళ్యాణిని గుర్తుంచుకోండి. వీలయినప్పుడు ఉత్తరం రాయండి-

మీ శ్రీమతిని, పిల్లలని అడిగినట్లు చెప్పండి.

ఉంటాను—కళ్యాణి.

ఉత్తరం మీద చంద్రశేఖర్ కళ్ళు చెమరుస్తున్నాయి. బాంకు చెక్కు చేతిలో వణుకుతోంది!

అయితే, అతనికి మరో ఆలోచన కూడా కలిగింది—ఈ డబ్బు గురించి జానక్కి తెలిస్తే మాత్రం వూరుకోదు. తనకి, కళ్యాణికి మధ్య ఏవో సంబంధాలున్న విషయం కాసేపు మరిచిపోయి, ఆ డబ్బుని ఖర్చు పెట్టేందుకు పథకాలు వేస్తుంది.

ప్రేయసి సలహా పాటించాలి!

తాను డబ్బు గురించే ప్రయత్నిస్తున్నట్టు, బాధపడుతున్నట్టు జానకి గ్రహించాలి....పరోక్షంగా ముఖ్యమైన బాకీలు తీర్చాలి....కళ్యాణి పదివేలు జాగ్రత్తపరచి, పువ్వుల్లో పెట్టి ఆమెకే అందించాలి!

"కళ్యాణీ...నీ మేలు ఎప్పటికీ మరువలేను ...చీకట్లో మిణుగురు పురుగు సృష్టించే వెలుతురు ఎంత గొప్పదో—నా ప్రస్తుత పరిస్థితుల్లో నీ సాయం అంతకన్నా గొప్పది..." చంద్రశేఖర్ స్వగతంలో అనుకోగానే అతని కళ్ళు మరింతగా చెమరించి వర్షించసాగాయి. ●

అంతరంగం

జాన్

మనః వాటికలో
జ్ఞాపకాల నాటికలు ....
వాస్తవాల తెరలు హఠాత్తుగా వారిస్తూ
వేదికపై నా నీడా
తోడుగా యేవేవో పొగలజాడా
ప్రేక్షకుడు వొకడే
వొంటరి నక్షత్రంలా మినుక్కు మినుక్కుమంటూ
సూత్రధారి యెవడో మాంత్రికుడు
నా నీడను వశపరచు కున్న తాంత్రికుడు
ప్రేక్షకుడు మాత్రం నిజంగా పిచ్చివాడు
పొగుడుతూ, తిడుతూ
నవ్వుతూ, యేడుస్తూ
రసాలు తొమ్మిదన్న వాడిని యెగతాళి పట్టిస్తూ
వొకోసారి కోపం వచ్చి
సుడిగాలిలా బయటకి పరిగెట్టుకెళ్ళిపోతాడు
నా నీడ మాత్రం వాడిని వెంటాడి
వాడిలో లయించుకుపోతుంది
చివరకు —
నే నే మిగులుతాను ....